

లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు : నిమ్మల

రైతు వద్ద ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు భరోసా ఇచ్చారు. నిర్దేశిత లక్ష్యం మేరకు కొనుగోలు పూర్తయినా ఇంకా కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. తమది రైతు మేలు ప్రభుత్వమని, ఎప్పుడూ రైతుకు అండగా ఉంటామన్నారు. రైతులు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకోవడానికి పూర్తిస్వేచ్ఛ ఇచ్చి 48 గంటల్లోనే సొమ్ము రైతుల ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు : జేసీ

తడిచిన ధాన్యాన్ని కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆచంట మండలంలో తడిచిన ధాన్యం రాశులు, బస్తాలను జేసీ, ఆర్డీవో దాసి రాజు పరిశీలించారు. తడిచిన ధాన్యం రైస్ మిల్లుకు పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకరాజు, ఏవో బి. నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

30 లక్షల గోనె సంచులు సిద్ధం : జేడీ

ధాన్యం కొనుగోలులో రెండు, మూడు రోజులుగా సంచుల కొరత ఏర్పడినట్లు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భారీ వర్షంతో అత్యవసరంగా 30 లక్షల గోనె సంచులను అందించే ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయ శాఖ జెడి జడ్డు వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటివరకు కోటీ 20 లక్షల గోనె సంచులు రైతులకు అందించామన్నారు.

- పోడూరు, ఆచంట, భీమవరం రూరల్


ఆచంట వేమవరంలో వర్షం నీటిలో నానుతున్న ధాన్యం రాశులు

ముంచేసింది

• ఈదురు గాలి.. భారీ వర్షం • వరి, మామిడి రైతుకు తీరని నష్టం

- కల్లాల్లో 1.50 లక్షల టన్నుల ధాన్యం
- తడిచిన ధాన్యం రాశులు, బస్తాలు
- నేలనంటిన వరి, నేలరాలిన మామిడి
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, తెగిన వైర్లు
- పల్లపు ప్రాంతాలు జలమయం
- చేలల్లో నిలిచిన వర్షపు నీరు

అకస్మాత్తుగా కురిసిన అకాల వర్షం రైతులను ముంచేసింది. జిల్లాలో వరి మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో వర్షానికి కల్లాల్లో ధాన్యం, రోడ్డుపై ఉన్న రాశులు, బస్తాల్లో నింపిన ధాన్యం తడిచిపోయింది. వర్షానికి తోడు ఈదురు గాలుల ధాటికి కోతకు సిద్ధంగా ఉన్న చేలు నేలనంటాయి. మామిడి కాయలు నేల రాలాయి. చెట్లు నేలకొరిగాయి. జిల్లాలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వైర్లు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. తీర ప్రాంతంలో ఉప్పు మడులు, రాశులు కరిగిపోయాయి. జిల్లాలో పలు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తణుకు మండలం వేల్పూరులో ఇల్లు కూలింది.

భీమవరం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రైతులకు శాపంగా మారింది. పంట చేతికందే సమయంలో ముంచేసింది. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలకు పైగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో వరికి నష్టం వాటిల్లింది. ముమ్మరంగా మాసూలు జరుగుతున్న సమయంలో భారీ వర్షంతో ధాన్యం రాశులు తడిచిపోయాయి. చేలల్లో వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో రైతులు రాశులు మార్పు చేసుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు చేయగా, ఇంకా 50 వేల ఎకరాల్లో మాసూలు చేయాల్సి ఉంది. వారం రోజులుగా మాసూలైన 1.50 లక్షల టన్నుల ధాన్యం రాశులుగా రహదారులు, కల్లాల్లో ఉండిపోయింది. భీమవరం, వీరవాసరం, పాలకోడేరు, నరసాపురం, పెనుమంట్ర, ఆచంట, కాళ్ల తదితర మండలాల్లో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ధాన్యం రాశులు, బస్తాలు సైతం తడిచిపోయాయి. ధాన్యం రంగు మారడం, మొలకలతో నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేలల్లో నీరు నిలిచిపోవడంతో వారం రోజులపాటు పంట మాసూలుకు అవకాశం ఉండదని రైతులు వాపోతున్నారు.

లక్ష టన్నుల అదనపు కొనుగోలు

దాళ్వా సీజన్‌లో వరి దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జిల్లాలో 6 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే 4.58 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. ఇంకా 1.5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా రైతుల వద్ద అదనంగా ఇంకో లక్ష టన్నులు ఉంటుంది. లక్ష టన్నులు అదనంగా కొనుగోలుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు జిల్లా వ్యవసాయ యంత్రాంగం తెలిపారు.




భీమవరం పట్టణం, రూరల్ మండలంలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, తెగిన వైర్లు

నేలరాలిన మామిడి కాయలు

మొగల్తూరు: ఈదురు గాలులు, వర్షంతో తీర ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారు. పశ్చిమ తీరంలో ఆలస్యంగా చేతికి వచ్చే మామిడి ఫలసాయం కొట్టుకుపోయింది. మొగల్తూరు మండలంలో సుమారు 980 ఎకరాల్లోని మామిడితోటల్లో ప్రతీ చెట్టు నుంచి 50 నుండి 200 కాయలు రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రాలిన కాయలను కిలోల లెక్కన అయినకాడికి అమ్ముకోవల్సి వస్తుందని, కూలీ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. దర్భరేవు డ్రెయిన్ ఆటుపోటుల ప్రభావంతో ముంపుకు గురవుతున్న రామన్నపాలెం అడవిపల్లలో సుమారు 300 ఎకరాల్లో రైతులు వ్యయప్రయాసలతో దాళ్వా సాగు చేశారు. కోతకు వచ్చిన చేలు నేలకొరిగి వరి కంకులు నీటిలో నానిపోతున్నాయి. కనీసం కోత, మాసూళ్ల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మొగల్తూరు పాతకాలువ సెంటర్, పేరుపాలెం, కాళీపట్నం గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి.

తడిచి ముద్దయిన ధాన్యం రాశులు

ఆచంట: మండలంలో వారం రోజులుగా దాళ్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం ఒక్కసారిగా ఈదురు గాలులతో సుమారు 3 గంటలు పాటు కురిసిన వర్షానికి కల్లాల్లో ధాన్యం రాశులు తడిచి ముద్దయ్యాయి. ఎ.వేమవరంలో ధాన్యం రాశులు నీట మునిగడంతో కల్లాల్లో నీటిని బయటకు తోడడానికి రైతులు అవస్థలు పడ్డారు. పలు గ్రామాల్లో రోడ్లపై ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. సుమారు 520 ఎకరాల్లో వరి చేలు పాక్షికంగా నేల కొరిగాయి. కట్టలుగా కట్టుకోవాలని ఏవో నాగరాజు సూచించారు.

యలమంచిలి: మండలంలో వర్షం జోరుకు వరి కుప్పలు తడిచిపోయాయి. ఈదురు గాలులకు సుమారు 250 ఎకరాల వరి నేలకొరిగింది. గాలి ఉధృతికి పలుచోట్లు చెట్లు పడిపోయాయి. కాజ వద్ద కొబ్బరిచెట్టు విద్యుత్ తీగలపై పడిపోయింది.


విద్యుత్ శాఖకు రూ.2 కోట్ల నష్టం


భీమవరం టౌన్: జిల్లాలో పలు ప్రాంతాల్లో చెట్లు కూలడంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయి, వైర్లు తెగిపడి సరఫరా నిలిచిపోయింది. జిల్లాలోని 94 సబ్ స్టేషన్ల పరిధిలో సుమారు 200 స్తంభాలు పడిపోయినట్లు అధికారులు గుర్తించారు. పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు తెగిపోవడం తో సుమారు రూ.2 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా. కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి తెగిపడిన వైర్లు సరిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లో సరఫరా నిలిచిపోవడంతో పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. సాయంత్రానికి పట్టణాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఆలపాటి రఘునాథబాబు జిల్లాలో పర్యటించారు. అన్ని ప్రాంతాలకు సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.


కాళ్లలో రహదారిపై వర్షపు నీరు


నీట మునిగిన పాలకొల్లు బస్టాండ్


ఆకివీడులో రహదారి జలమయం


నరసాపురంలో వర్షపు నీటిలో వరి పనలు


మొగల్తూరులో నేలరాలిన మామిడి


యలమంచిలిలో నేలనంటిన వరి


పాలకోడేరులో నేలకొరిగిన చెట్టు


వేల్పూరులో కూలిన ఇల్లు


భీమవరంలో ఆటోపై విరిగిపడిన చెట్టు


ఉంగుటూరులో తడిచిన ధాన్యం బస్తాలు


ఆచంటలో జేసీ పరిశీలన


తాడేపల్లిగూడెం పరీక్ష కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

నీట్ కట్టుదిట్టం

- తాడేపల్లిగూడెంలో నాలుగు పరీక్ష కేంద్రాలు
- 1,886 మంది అభ్యర్థులకు 1,847 మంది హాజరు
- సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా

7

ఈసెట్, ఐసెట్‌లకు ఏర్పాట్లు పూర్తి

ట్రిపుల్ ఐటీలకు 17,256 దరఖాస్తులు

నూజివీడు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని 4 ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు ఆదివారం నాటికి 17,256 దరఖాస్తులు దాఖలైనట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఆర్కేవ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లలో ప్రతి క్యాంపస్‌లో వెయ్యి సీట్లకు అదనంగా మరో 100 సూపర్ న్యూమరీ సీట్లకు గాను ఏప్రిల్ 27వ తేదీ నుంచి దరఖాస్తులను యూనివర్సిటీ స్వీకరిస్తోంది. ఈనెల 20వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మెరిట్ విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చని ఆయన తెలిపారు.

నరసాపురానికి వందేభారత్

- రైల్వే స్టేషన్‌లో శరవేగంగా పనులు
- త్వరలో రైల్వే బోర్డు ఆమోదం


నరసాపురంలో ట్రాక్ పనులు చేస్తున్న కార్మికులు

నరసాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న వందేభారత్ రైలు త్వరలో జిల్లాలో పరుగులు తీయనుంది. దీనికి అనుగుణంగా నరసాపురం స్టేషన్‌లో శరవేగంగా పనులు సాగుతున్నాయి. రైల్వేబోర్డు నుంచి ఆమోదం రాగానే నరసాపురం - చెన్నై మధ్య ఈ రైలు నడవనుంది. ప్రస్తుతం చెన్నై - విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్ విజయవాడ చేరిన తర్వాత తిరిగి చెన్నై వెళ్లడానికి 4 గంటల పాటు ప్లాట్‌ఫాంపై ఉంచేస్తున్నారు. దీనితో రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తలెత్తుతుంది. ఇటీవల విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైళ్ల సంఖ్య పెరిగింది. ప్లాట్‌ఫారం ఖాళీ లేక కొన్ని రైళ్లను సిగ్నల్ ఇచ్చే వరకు లూప్‌లైన్‌లో ఉంచుతున్నారు. దీని వల్ల షెడ్యూల్ సమయాలు మారిపోతున్నాయి. వీటిని గుర్తించిన రైల్వే అధికారులు వందేభారత్‌ను భీమవరం వరకు పొడిగించాలని భావించారు. భీమవరం స్టేషన్‌లో నిర్వహణ సిబ్బంది లేరు. భోగిల్లో నీళ్ల నింపే పైప్‌లైన్లు కూడా లేక భీమవరం పొడిగించడానికి సాధ్యం కాలేదు.

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ చొరవతో..

భీమవరం వరకు పొడిగించే ప్రయత్నం విరమించుకున్న రైల్వే శాఖ సమీపంలోని మచిలీపట్నం వరకైనా పొడిగించాలని యోచించింది. ఎన్డీఏ ప్రభుత్వంలో నరసాపురం ఎంపీ శ్రీనివాసవర్మకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కడంతో వందేభారత్‌ను నరసాపురం వరకు పొడిగించే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఏలూరు మీదుగా వందే భారత్ నడుస్తోంది. పశ్చిమలో కూడా ఈ రైలును నడపాలని, ఈ ప్రాంతంలో డిమాండ్‌ను రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించడంతో లైన్ క్లియర్ అయింది. వందేభారత్ రాకకు అనుగుణంగా నరసాపురం రైల్వేస్టేషన్‌లో పనులకు పచ్చజెండా ఊపారు. ప్రస్తుతం ఒక్క ప్లాట్‌ఫాంలోనే రైళ్లకు నీరును నింపే సదుపాయం ఉంది. తాజాగా ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంలో నిలిచే రైళ్లకు నీటిని నింపే విధంగా పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. దాదాపు 70శాతం పనులు పూర్తయ్యాయి. ఈనెలాఖరు నాటికి పనుల్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ట్రాక్ పటిష్ఠ పనులు కూడా చేపడుతున్నారు.

రైల్వేబోర్డు ఆమోదం రాగానే..

ప్రస్తుతం విజయవాడ నుంచి నడిచే రైలు రాత్రి 9.30 గంటలకు చెన్నై చేరుతుంది. విజయవాడలో సాయంత్రం 3.30 గంటలకు బయలుదేరుతుంది. ఈ షెడ్యూల్ సమయాలకు అనుగుణంగానే నరసాపురం - విజయవాడ మధ్య నడవనుంది. విజయవాడకు ఉదయం 11.30 గంటలకు చేరుతుంది. అక్కడి నుంచి గంటన్నర వ్యవధిలో నరసాపురం చేరుకుని తిరిగి 2గంటలకు బయలుదేరేవిధంగా షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు. ఇప్పటికే సదరన్ రైల్వే ఈ షెడ్యూల్ సమయాలకు పచ్చజెండా ఊపింది. రైల్వే బోర్డు కూడా ఆమోదిస్తే వచ్చే నెల నుంచే జిల్లా వాసులకు వందేభారత్ కూత వినిపించే అవకాశం రానుంది.

ముందే చెల్లించారు

- పట్టణాల్లో పన్ను చెల్లింపులపై రాయితీ
- జిల్లాల్లో రూ.22.07 కోట్లు వసూలు

భీమవరం టౌన్, మే4 (ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీల పరిధిల్లో ముందస్తు పన్ను చెల్లింపులపై ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో వసూళ్లు పెరిగాయి. పట్టణాల్లో ప్రైవేటు ఆస్తుల యజమానులు ముందస్తు చెల్లింపులపై ఆసక్తి కనబరిచారు. ఆస్తి పన్ను వచ్చే ఏడాది మార్చి 31లోగా చెల్లించే అవకాశం ఉంది. ఏడాది ఆస్తి పన్ను ఒకేసారి ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలాఖరులో చెల్లించే విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఒకేసారి పన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ ఇవ్వడంతో యజమానులు ముందుకు వచ్చారు. దాదాపు దశాబ్ద కాలంగా అమలులో ఉన్న ఈ విధానం ఈ ఏడాది కూడా ప్రభుత్వం అమలు చేసింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ముందస్తు వసూళ్లతో అన్ని మునిసిపాల్టీలలో కలిపి రూ.6.74 కోట్లు పెరిగింది. రాయితీతో చెల్లింపులకు గత నెల 30న గడువు ముగిసింది. జిల్లాలోని అన్ని పట్టణాల్లో నెల రోజులకు రూ22.07 కోట్లు వసూలు కావడం విశేషం. గత ఏడాది రూ.15.33 కోట్లు వసూలు కాగా ఈ సారి రూ.6.74 కోట్లు అదనంగా వసూలైంది. ముందస్తు పన్ను వసూళ్లలలో భీమవరం మునిసిపాల్టీలో అత్యధికంగా రూ.7.22 కోట్లు వసూలైంది. తరువాతి స్థానంలో తణుకు మునిసిపాల్టీ రూ. 5.58 కోట్లు వసూలు చేసింది. జిల్లాలో పట్టణాల వారీగా వసూళ్ల ఇలా..

మునిసిపాల్టీ	ఏడాది ఆస్తిపన్ను రూ.(కోట్లలో)	వసూలైంది రూ.(కోటల్లో)	గత ఏడాది రూ.(కోట్లలో)
భీమవరం	24.5	7.22	6.01
తణుకు	19.83	5.58	3.65
టీపీగూడెం	20.63	4.95	3.06
పాలకొల్లు	12.65	2.22	1.39
నరసాపురం	10.69	1.50	1.10
ఆకివీడు	3.56	0.61	0.31
	104.79	**22.07**	**15.33**

జడ్పీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

షార్ట్ సర్క్యూట్ కారణం?

7

ఈసెట్, ఐసెట్‌లకు ఏర్పాట్లు పూర్తి

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పది కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు

ఏలూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్న ఈసెట్, ఏపీఐసెట్ పరీక్షలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య ఖరారైంది. ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈసెట్ పరీక్ష ఈనెల 6న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో జరుగుతుంది. ఈ పరీక్షకు మొత్తం 2,345 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఏలూరు సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు, సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, భీమవరం డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, దంతులూరి నారాయణరాజు అటానమస్ కళాశాల, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీ విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాల, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏపీ ఈసెట్ పరీక్ష జరుగుతుంది. ఈ కళాశాలల్లో ఉదయం షిఫ్టులో జరిగే పరీక్షకు 1,443 మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 902 మంది అభ్యర్థులను కేటాయించారు.

7న ఇవే కళాశాలల్లో ఏపీఐసెట్ పరీక్ష

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ పరీక్ష ఈనెల 7న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా మొత్తం పది కేంద్రాల్లో జరుగుతుంది. ఏపీఈసెట్‌కు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లోనే ఐసెట్‌కు ఎంపిక చేశారు. ఈ పరీక్ష ఉదయం 9 నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఉదయం షిఫ్టు పరీక్షకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,477మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 1,479మంది అభర్థులు కలిపి మొత్తం 2956మంది దరఖాస్తు చేసుకున్నారు. హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా ఫొటో గుర్తింపుకార్డుతో అభ్యర్థులు హాజరుకావాలి. పరీక్ష ప్రారంభ సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

భక్తి విలువలు తెలిపేలా 'అనంతాళ్వార్' సినిమా

» జూన్‌లో ద్వారకాతిరుమలలో ప్రారంభిస్తాం : సినీ నటుడు బాలాజీ


శ్రీవారి ఆలయంలో సినీ నటుడు బాలాజీ

ద్వారకాతిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): నేటి యువతరానికి భక్తివిలువను తెలియజెప్పేలా తాను నిర్మించనున్న భక్తాగ్రేశ్వరుడు అనంతాళ్వార్ సినిమాకు ఏ అవరోధాలు లేకుండా చూడాలని కోరేందుకు శ్రీవారి సన్నిధికి వచ్చామని ప్రముఖ సినీనటుడు, క్యారెక్టర్ ఆర్టిస్ట్ బాలాజీ తెలిపారు. ఆదివారం చినవెంకన్న ఆలయాన్ని ఆయన సందర్శించి పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనను పలువురు అభిమానులు గుర్తించి ఫొటోలు దిగారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అనంతాళ్వార్ సినిమాను జూన్‌లో ద్వారకాతిరుమల శ్రీవారిసన్నిధిలో ప్రారంభిస్తానన్నారు. స్వామికి నిత్యం పూలమాలలు సమర్పించే అనంతాళ్వార్ ఆ స్వామివారి మీదకి గునపాన్ని విసిరారని ఆ గునపం ఇప్పటికీ తిరుమల మహాద్వారం దాటిన తర్వాత కుడివైపున గోడకు వేలాడుతూ ఉంటుందన్నారు. ఆ గునపం స్వామి మీదకు ఎందుకు విసిరారో నేటియువతరం తెలుసు కోవాలని, ఈ సినిమా ద్వారా భక్తి విలువలు చాటిచెప్పాలని ఉందని తెలిపారు.


విలేకరులతో మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకుడు అలోక్‌కుమార్

పాకిస్థాన్ ఉగ్రమూలాలను ఏరివేయాలి

» విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్

భీమవరం క్రైం, మే 4(ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలతోసహా జిహాది ఉగ్రవాదాన్ని నిర్మూలించి ఉగ్రమూలాలను ఏరివేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) పిలుపునిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అలోక్‌కుమార్ అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద తయారీ కేంద్రాలు, నిరంతర ఉగ్రవాద చర్యలను తుదముట్టించాలని వీహెచ్‌పీ పిలుపునిస్తుందన్నారు. ఘర్ వాపసీ ఉద్యమాలు, ప్రభుత్వ నియంత్రణ నుంచి దేవాలయాల విముక్తి, మత మార్పిడిలను ఆపడంతోపాటు అవసరమైన వారికి సేవా కార్యక్రమాలను పెంచుతామన్నారు. పహల్గామ్ దాడిలో జిహాది ఉగ్రవాద చర్య తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అటువంటి ఘోరమైన చర్యలకు మద్దతు, శిక్షణ ఇస్తున్న పాకిస్థాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అనంతరం విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, పరిషత్ ప్రాంతీయ అధ్యక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు మాట్లాడారు. పరిషత్ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు రుద్రరాజు వేణుగోపాలరాజు అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, వీహెచ్‌పీ ప్రాంతీయ కార్యదర్శి భూపతిరాజు సుబ్బరాజు, నడింపల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


శ్రీవారి ఆలయ అనివేటి మండప ప్రాంతంలో భక్తులు

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మే 4(ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మార్మోగింది. ఆదివారం, సప్తమి తిథి మంచిది కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో రద్దీగా ఉంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. సుమారు 12 వేల మంది వరకు భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తుల సందడి

బుట్టాయగూడెం, మే 4(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ మన్యంలో ఉన్న వనదేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే భక్తులు అమ్మవారి దర్శనాలకు క్యూ కట్టారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడి ఉంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం ఏజెన్సీలో వర్షం కురిసినా అమ్మవారి దర్శనాలకు ఎటువంటి ఆటంకాలు కలగలేదు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.



చేతుల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

● పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

పరిశుభ్రమైన చేతులు ఆరోగ్యానికి చిహ్నాలు.. చేతుల పరిశుభ్రం ద్వారానే మనం ఎటువంటి రోగాలకు గురికాకుండా ఉండొచ్చని ప్రపంచ వ్యాప్తంగా వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. మనం తీసుకునే ఆహారంతోనే రోగ కారక క్రిములు మన శరీరంలోకి ప్రవేశిస్తాయని తద్వారా జ్వరం, డయేరియా అజీర్తి మొదలగు రోగాలు మన శరీరంలోకి ప్రవేశించి అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. అందుకే ప్రజలు ప్రతినిత్యం చేతుల పరిశుభ్రంగా ఉంచుకుని రోగాలకు దూరంగా ఉండాలి. మే 5న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నిడమర్రు, మే 4(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతిరోజు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలన్న విషయం ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. చేతుల పరిశుభ్రతకు ఆరోగ్యానికి ఉన్న సంబంధంపై చాలా ఏళ్ల క్రిందటే వైద్యనిపుణులు గుర్తించారు. 1940లో వియత్నాం దేశంలో వియన్నా జనరల్ హాస్పిటల్ వైద్యాధికారి ఇగ్నాల్ సెమ్మెల్‌వీస్ మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలు చేతులు కడుక్కోకపోవడం వల్లే అతిసారం వ్యాధికి తీవ్రంగా గురవుతున్నారని పరిశోధనల ద్వారా నిర్ధారించి దీనిపై అవగాహన కార్యక్రమాలు ఆ దేశంలో నిర్వహించారు.. అందుకే ఇగ్నాజ్ సెమ్మెల్‌వీస్‌ను పరిశుభ్రత పితామహుడుగా పిలుస్తారు. కొంతకాలం తర్వాత ఇటలీలో క్రిమియన్ యుద్ధంతో ఫ్లోరెన్స్ నైటింగేల్ తమ వైద్య విధానంలో చేతుల పరిశుభ్రతపై ప్రత్యేక పద్ధతులు అవలంబించి రోగాల వ్యాప్తికి అడ్డుకట్టు వేశారు. 2008లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ చేతులు పరిశుభ్రత దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించి ప్రజలలో అవగాహన కోసం అనేక అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

చేతుల పరిశుభ్రత అలవాటు చేయాలి



ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర వేత్తలు చేతుల పరిశుభ్రతపై చేసిన పరిశోధనలో చేతుల ద్వారానే 90 శాతం క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయని నిరూపితమైంది. పాఠశాల స్థాయినుంచే విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత తెలియజేస్తూ చేతుల పరిశుభ్రత అలవాటు చేయాలి.

- డాక్టర్ నూకల మహీధర్, ఎం.ఎస్ తాడేపల్లిగూడెం

మన చేతులు మన భవిష్యత్తు..

చిన్నారులకు తమ పాఠశాల వయస్సు నుంచే చేతుల పరిశుభ్రతపై అవగాహన పెంచడం కోసం ఐక్యరాజ్య సమితి ప్రపంచవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో చేతులు పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు తమ చిన్నారులకు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడాన్ని పోత్సహించాలి. అలాగే పాఠశాలలో ఉపాధ్యాయులు చేతుల పరిశుభ్రంపై అవగాహన కల్పించాలి.

పోషకాహారంతో రోగాలు దూరం..

మనం తీసుకొనే ఆహారంతోనే మనకు రోగాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. తీసుకునే ఆహారం పరిశుభ్రమైనప్పుడు రోగాల నుంచి దాదాపుగా దూరంగా ఉండొచ్చని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది. 90శాతం రోగాలు ఆహారం తీసుకునే ముందు మన చేతులు కడుక్కోకపోవడం ద్వారా వ్యాప్తిస్తాయి. బ్యాక్టీరియా, వైరస్‌లు చేతుల ద్వారా మన ఆహారంతోపాటు జీర్ణాశయంలో ప్రవేశించి అనేక రోగాలకు కారణమవుతున్నాయి. చేతులు పరిశుభ్రత ద్వారా పిల్లలలో 20 నుంచి 40 శాతం డయేరియా రోగాలు తగ్గుముఖం పట్టాయి. 58 శాతం మందిలో డయేరియా వ్యాధికారక క్రిములు నిర్మూలించబడ్డాయి. 20శాతం మందిలో శ్వాసకోస రోగాల వ్యాప్తి నివారించబడిందని పరిశోధనలు నిర్ధారించాయి.

చేతులు శుభ్రత ఎప్పుడంటే..

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో చేతులు ఎప్పుడు కడుక్కోవాలో పరిశోధనలతో కొన్ని సందర్భాలు ప్రత్యేకంగా పేర్కొన్నారు.

- మల విసర్జన తర్వాత.
- మూత్ర విసర్జన తరువాత.
- భోజనాలు తయారు చేసేముందు.
- భోజనం తినేముందు, తరువాత..
- దగ్గు దగ్గిన తరువాత.
- ముక్కు చీదిన తరువాత.
- చేతులు మురికిగా ఉన్నప్పుడు.
- జంతువులను తాకిన తర్వాత.
- పేడ వంటి జంతువుల మలమూత్రాలను తాకిన తర్వాత

చేతులు పరిశుభ్రత ఇలా..

చేతులు పరిశుభ్రత సంపూర్ణంగా చేయడం కోసం వైద్య నిపుణులు కొన్ని ప్రత్యేక పద్ధతులను సూచించారు. ప్రతిఒక్కరూ చేతులను నీళ్ల, సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రోగాల నివారణకు ఇది అత్యుత్తమ, అత్యంత చౌక మార్గంగా నిర్ధారించబడింది.

- ముందుగా చేతులను నీళ్లతో తడి చేసుకోవాలి
- తర్వాత సోప్‌తో గానీ, హ్యాండ్ వాషింగ్ లిక్విడ్‌ను కొంతచేతిలో తీసుకొని నురుగు వచ్చేవరకు రుద్దాలి.
- సబ్బు నరుగతో అరచేయిలో మరో అరచేయి వేసి రుద్దాలి. చేతి వేళ్ల సందుల్లో వేళ్లు వేసి రుద్దుకోవాలి
- చేతుల గోళ్ల వద్ద ప్రత్యేకంగా సబ్బుతో రుద్దుకోవాలి
- చేతుల ఉపరితలం మీద సబ్బుతో మణికట్టువరకు రుద్దుకోవాలి.
- నడుస్తున్న నీటితో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- పొడి గుడ్డతో లేదా సింగిల్ యూజ్ పేపర్ (టిష్యూ పేపర్)తో తుడుచుకోవాలి.

ఈ పక్రియ సుమారు 20-30 సెకన్లు పాటు తప్పనిసరిగా నిర్వహిస్తే మన చేతిలో క్రిముల 95 శాతం వరకు నిర్మూలించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

శుభ్రం చేసుకోండి ఇలా..



నీట్ ప్రశాంతం

» ఏలూరు జిల్లాలో 1,162 మంది, తాడేపల్లిగూడెంలో 1,847 మంది హాజరు

» పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా


తాడేపల్లిగూడెం నిట్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఏలూరు అర్బన్/తాడేపల్లిగూడెం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష పటిష్ఠ బందోబస్త్ నడుమ ఆదివారం ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఏలూరు జిల్లా ఏలూరులో మూడు కేంద్రాలు, గోపన్నపాలెంలో మరో రెండు కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు మొత్తం 1,200 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా, వీరిలో 1,162మంది హాజరయ్యారు. ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు కేంద్రానికి 240 మందికి 234మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 240మందికి 232, కస్తూరిబా బాలికోన్నత పాఠశాలకు 360మందికి 347, గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయకు 240మందికి 235, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 120మందికి 114మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదని నీట్-యూజీ సిటీ కో-ఆర్డినేటర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.ఎస్.మీనా తెలిపారు. పరీక్ష ముగిసిన అనంతరం జవాబు పత్రాలను గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయకు చేర్చి, ప్యాక్ చేసి సీల్ వేసిన అనంతరం సాయుధ పోలీసు బందోబస్తు నడుమ స్పీడ్‌పోస్టులో తరలించారు. పరీక్ష కేంద్రాలను డీఆర్వో, ఏలూరు డీఎస్పీ, డీఈవో, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, తదితరులు సందర్శించారు. నీట్-యూజీకి జిల్లా నోడల్ అధికారిగా కలెక్టర్ వెట్రిసెల్వి వ్యవహరించారు. జిల్లాలోని ఐదు కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.


తాడేపల్లిగూడెం నిట్ వద్ద హాల్‌టికెట్‌లు పరిశీలిస్తున్న సిబ్బంది

● పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన నాలుగు సెంటర్లలో 1,886 మంది విద్యార్థులకు గాను 1,847 మంది పరీక్షలు రాశారు. మూడంచెల తనిఖీలతో విద్యార్థులను తనిఖీ చేస్తూ పరీక్ష కేంద్రాలకు ఉదయం 11 గంటల నుంచే అనుమతించారు. పరీక్షల సరళిని కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు.

● ఈదురుగాలులతో కూడిన వర్షం ఆదివారం ఉదయం కురవడంతో పరీక్షకు ఆటంకం ఏర్పడుతుందేమోనన్న భయాందోళన వ్యక్తమైంది. పది గంటల నుంచే వర్షం తగ్గుముఖం పట్టడంతో పరీక్షలు ప్రశాంతంగా రాశారు. పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందే గేటు క్లోజ్ చేస్తామని ప్రభుత్వం విస్తృత ప్రచారంచేయడంతో ఆమేరకు అభ్యర్థులు ఉదయం పదకొండు గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులు చేతి రింగ్‌లు, వాచీలు, ఫోన్‌లతోపాటు చెవి రింగులు లేకుండానే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ హాజరుతీసుకున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ప్రాంగణాల్లో నిశిత నిఘా సాయంత్రం ఐదు గంటలవరకు కొనసాగింది. పరీక్ష కేంద్రాల పరిధిలో సెల్‌ఫోన్లు పనిచేయకుండా జామర్లను ఏర్పాటు చేశారు.


ఏలూరులో తనిఖీలు చేసి పరీక్ష హాలులోకి పంపిస్తున్న అధికారులు, పోలీసులు



క్రైమ్ కార్నర్

వివాహిత ఆత్మహత్య


పుష్ప మృతదేహం

ఏలూరు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు చాణుక్యపురి కాలనీ రెండో రోడ్డునకు చెందిన ముప్పన పుష్ప (40)కు భర్త హనుమంతరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడు ఒక షాపులో గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆమె గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్యం చేయిస్తున్నారు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులంతా యథావిధిగా నిద్రించారు. తెల్లవారేసరికి ఆమె ఉరివేసుకుని ఉంది. ఆమెను ఉరి నుంచి దించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు. అనారోగ్య కారణం వల్ల ఆమె జీవితంపై విరక్తి చెందిన ఉరి వేసుకున్నట్లుగా గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

స్నేహితుడి దగ్గరకు వెళుతూ..

» పాల వ్యాన్‌ను ఢీకొట్టిన మోటారు సైకిల్ ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

పెదవేగి, మే 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఒకరి ప్రాణం తీయగా, మరొకరిని తీవ్రంగా గాయపర్చింది. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. బిహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన చందన్, మనోజ్ పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో ఓ రైతు దగ్గర మూడు నెలలుగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి రైతు దగ్గర జీతం సొమ్ము తీసుకుని రాత్రి తొమ్మిది గంటల సమయంలో కొప్పులవారిగూడెం నుంచి వేగివాడలోని స్నేహితుని దగ్గరకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ముండూరు గ్రామం చివర చికెన్ షాపు సెంటర్ దగ్గర ఎదురుగా వస్తున్న పాల వ్యానును వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పాలవ్యాన్ ముందు చక్రాల కింద ఇరుక్కుపోవడంతో చందన్(25) అక్కడికక్కడే మృతిచెందాడు. మనోజ్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

» ఇద్దరికి తీవ్ర గాయాలు

» క్షతగాత్రులకు అండగా నిలిచిన మంత్రి నాదెండ్ల మనోహర్


క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

ద్వారకాతిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మండలంలోని ఎం.నాగులపల్లి అడ్డరోడ్డు వద్ద ఇన్నోవా కారు, పక్కనే వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో విజయవాడ నుంచి కాకినాడకు వెళ్తూ రోడ్డు ప్రమాదాన్ని చూసిన మంత్రి నాదెండ్ల మనోహర్ కారు ఆపి గాయపడిన వ్యక్తులకు సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పెదవేగి మండలం చక్రాయిగూడెంకు చెందిన దొంగల రాజకుమార్, రామకృష్ణ బైక్‌పై ఆదివారం రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. పక్కనే వెళ్తున్న కారు వీరిని ఢీకొట్టడంతో వారిరువురూ తీవ్రగాయాల పాలయ్యారు. రోడ్డుపై పడిఉన్న క్షతగాత్రులను చూసి చలించిన మంత్రి వెంటనే తాను ప్రయాణిస్తున్న కారు ఆపి హైవే పెట్రోలింగ్ పోలీసులను, అంబు లెన్స్‌ను పిలిపించారు. పెట్రోలింగ్ పోలీసు లు వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిం చారు. మంత్రి తన కాన్వాయ్‌లోని ప్రొటో కాల్ వాహనాన్ని అంబులెన్స్‌కు ఎస్కార్ట్‌గా ఉపయోగించి వేగంగా ఆసుపత్రికి చేరేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీకి స్వ యంగా ఫోన్ చేసి గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని సూచించారు.


గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

పాలకోడేరు, మే 4(ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరులోని వనుములమ్మ ఆలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. భారీవర్షం నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఆ గ్రామమంతా చీకటిమయంగా ఉంది. అదే సమయంలో విస్సాకోడేరు శివారు వంకాయలపాలెంకు చెందిన కురసా శ్రీనివాసరావు(50) ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అక్కడికక్కడే అతడు మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు పాలకోడేరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు


పవన్ కుమార్ (ఫైల్)

మొగల్తూరు, మే4 (ఆంధ్రజ్యోతి) : పేరుపాలెం సాగర తీరానికి వచ్చి సముద్ర స్నానానికి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపిన వివరాలివి.. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంకు చెందిన వలవల దివ్య శ్రీరామ్ పవన్‌కుమార్ అనే యువకుడు భీమవరంలో బీటెక్ చదువుతు న్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో స్నేహితులతో కలిసి బీచ్‌కు వచ్చి సముద్ర స్నానానికి దిగిన యువకుడు సముద్ర అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. పవన్ తండ్రి శ్రీరామ్మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.



'జడ్పీ'లో అగ్ని ప్రమాదం

» షార్ట్ సర్క్యూటే కారణమా ?

ఏలూరు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాలివి.. జడ్పీ కార్యాలయంలోని ఏవో గదిలో ఏసీ షార్ట్‌సర్క్యూట్ కావడంతో పొగ, మంటలు వ్యాపించాయి. గది బయటే ఉన్న సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రామకృష్ణ సిబ్బందితో అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగి ఉండొచ్చని, ఏసీతో పాటు ఫైళ్లు, ముఖ్యమైన వస్తువులు తగలబడ్డాయా అనే కోణంలో పరిశీలన చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తుందని కొందరు చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందా లేక ఇతర కారణాలున్నాయా అని అంటున్నారు.

ఉండిలో చోరీ

11 కాసుల బంగారం.. నగదు అపహరణ

ఉండి, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉండి బాలాజీరావు పేటలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. బాలాజీరావు పేటకు చెందిన శేషాద్రి వెంకట మధుసూదనరావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల మూడో తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగొలగొట్టి బీరువాలో ఉన్న 11 కాసుల బంగారం, రూ.35 వేలు నగదు తస్కరించారు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

కల్లాల్లో ధాన్యం పరిశీలన

యలమంచిలి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తహసీల్దారు జి.పవన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి సిహెచ్.దేవి ఆదివారం పరిశీలించారు. వాతావరణం అనుకూ లించిన వెంటనే కల్లాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని తహసీల్దార్ సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం లోడ్లు త్వరితగతిన అన్‌లోడ్ చేసేలా అన్ని చర్యలు చేపట్టామని తెలియజేశారు. గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు : జేసీ

పెనుగొండ, మే 4(ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుం టుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ములపర్రు, దేవ గ్రామాల్లో నరసాపురం ఆర్డీవో దాసి రాజుతో కలిసి ఆదివారం పర్యటించారు. కోసిన ధాన్యాన్ని మెరక ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. ధాన్యం తేమ శాతం విషయంలో మిల్లర్లు ఇబ్బందులు పెడితే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.


దువ్వలో రహదారిపై ఉంచిన ధాన్యం


మొగల్తూరులో రాలిన మామిడి


పెనుమంట్రలో తడిచిన ధాన్యాన్ని చూస్తున్న అన్నదాత


అప్పన్నచెర్వులో విద్యుత్ తీగలపై పడిన కొబ్బరిచెట్టు


పెనుగొండలో జోరు వాన

అన్నదాతకు అకాల కష్టం

బరకాలతో కప్పినా కింది నుంచి చేరిన నీరు
రాలిన మామిడి.. కరిగిన ఉప్పు మడులు
పంట చివరి దశలో అన్నదాత పాట్లు

తణుకు రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): దాళ్వా చివరి దశలో కురిసిన అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. కష్టపడి పండించిన వరి చివరి దశలో ధాన్యం రాశులుగా ఉన్న సమయంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి రహదారులు, పుంత గట్లు ఉన్న రాశులు తడిచిపోయాయి. ఈదురు గాలులకు ధాన్యంపై కప్పిన గడ్డి, బరకాలు ఎగిరిపోవడంతో రాశులుగా పోసిన ధాన్యంతో పాటు ధాన్యం బస్తాలు కూడా తడిచిపోయాయి. తణుకు మండలంలోని దువ్వ, వరిగేడు రోడ్డులో పల్లపు పొలాల నుంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని రోడ్డు పక్కన రాశులుగా పోశారు. ఆదివారం ఉదయం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి రాశుల కిందకు వర్షపు నీరు చేరి ధాన్యం తడిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా తణుకు రూరల్ మండలం వేల్పూరులో తాళ్ల కోటమ్మ, కోట స్వామి కుటుంబాలకు చెందిన డాబా స్లాబ్, ప్రహరీ గోడ కూలిపోయింది. ఆ సమయంలో ఆ యింటిలో ఎవరూ లేకపోవడంతో ఆ ఇంటిలో నివశించే వారు ప్రాణాలతో బయటపడ్డారు. కూలిన ఇంటిని రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. సీపీఎం నాయకులు బళ్ల చిన వీరభద్ర రావు, వాసా వెంకటేశ్వర రావు తదితరులు పరిశీలించారు.

ఇరగవరం: భారీ వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులు మునిగిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారు. మండలంలో 13,500 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 13,060ఎకరాల్లో రబీ వరి కోతలు పూర్తయ్యాయని ఇప్పటి వరకూ 20,237 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మండల వ్యవసాయ అధికారి వై. రాఘవేంద్ర రావు తెలిపారు.

పెంటపాడు: మండలంలో ఆదివారం సుమారు 2 గంటలకు పైగా ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. కల్లాల్లో ఉన్న ధాన్యంపై బరకాలు కప్పినా కింది నుంచి వర్షం నీరు చేరి ధాన్యం మొత్తం తడిచి ముద్దయ్యింది. మండలంలో మిల ర్లకు టార్గెట్‌లు పెంచాలని, సకాలంలో తమకు సంచులు ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని భారీ వర్షానికి పలు చోట్ల చెట్లు, విద్యుత్ తీగలు నేల కొరిగాయి. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

నరసాపురం రూరల్: అకాల వర్షం రైతుల్ని కొలుకోలేని దెబ్బతీసింది. దాళ్వా బాగా పండిందన్న రైతుల ఆనందంపై వర్షం నీళ్ల చల్లింది. వైఎస్‌పాలెం, రుస్తుంబాదా, సీతారాంపురం, మల్లవరం, ఎల్బీ చర్ల, కొప్పర్రు, చినమామిడిపల్లి, చిట్టవరం, గొంది తదితర గ్రామాల్లోని కోసిన వరి పనలు నీటిలో తేలియాడుతున్నాయి. మరోవైపు వర్షానికి ఈదురు గాలులు బలంగా వీయడంతో వందలాది ఎకరాల్లోని మామిడికాయలు రాలిపోయాయి. ఉప్పు రాశులన్నీ నీటిలో కలిసిపోయాయి. చినలంక, వేములదీవి, పీఎంలంక గ్రామాల్లో సుమారు 80 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. ఉదయం ఎండ కాయడంతో పంటకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని రైతులు భావించారు. అయితే ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడం, వర్షం బీభత్సవం సృష్టించడంతో పంటను కాపాడలేకపోయారు. ఉదయం నుంచి సాయంత్రం కరెంట్ లేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పలు గ్రామాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని రైతుల్ని అడిగి తెలుసుకున్నారు.

పోడూరు: మండలంలో రైతులు ఆరబెట్టిన ధాన్యం రాశులను చేలల్లోనూ, దిబ్బలపై ఉంచేయడంతో ధాన్యం రాశుల్లోకి నీరు చేరింది. వరిచేల్లో మోకాల్లోతు వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో కోతలకు అంతరాయం ఏర్పడింది. కనీసం నాలుగురోజులైతే గానీ చేలు ఆరవంటున్నారు. తడిచిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనీ రైతులు అధైర్యపడొద్దని పోడూరు తహసీల్దార్ ఫాజిల్ అన్నారు. మండలంలో తడిచిన ధాన్యం రాశులను, వరిచేలను వ్యవసాయాధికారితో కలిసి పరిశీలించారు.

పెనుగొండ: మండలంలో ధాన్యం రాశులు, బస్తాల పక్కన వర్షం నీరు నిలిచిపోవడంతో నీటిని మళ్ళించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇలపర్రు గ్రామానికి చెందిన రైతు ధాన్యం తూకం తూచి వారం రోజులు అయినా బస్తాలు వెళ్ళకపోవడంతో ఆదివారం కురిసిన వర్షానికి తడిసిపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

గణపవరం: రోడ్లపైన, కల్లాల్లోనూ ఆరబెడుతూ విక్రయించేందుకు ఎదురు చూస్తున్న రైతులకు ఆదివారం కురిసిన భారీ వర్షం నష్టాలపాలు చేసింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులునానా తంటాలు పడుతున్నారు.

పాలకోడేరు: మండలంలో యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో రైతులు రోడ్లపై ఆరబెట్టారు. అయితే అకస్మాత్తుగా వచ్చిన వర్షంతో తమ కష్టాన్ని కాపాడుకోవడానికి అన్నదాతలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

పెనుమంట్ర: అకాల వర్షాలకు ఆరుగాలం శ్రమించి పండించిన పంట తడిసిపోయింది. ఈదురు గాలులకు ధాన్యం రాశుల పైకప్పిన టార్పాలిన్లు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసిపోయింది. మరోపక్క బస్తాలు తడిసి పోయాయి దీంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారం
ఫోన్ ఇన్‌కు స్పందన ● ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు


కాంతారావు

తణుకు, మే 4(ఆంధ్రజ్యోతి): సజ్జాపురం ప్రాంతానికి చెందిన ఎ.కాంతారావు గత ఐదేళ్ళగా తమ ఇంటికి లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులు చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 24న 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఎస్ఈ రఘునాథబాబుకు సమస్య వివరించడంతో తణుకు ఏఈ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించారు. ఐదేళ్ళుగా తీరని సమస్య పరిష్కారం కావడంతో కాంతారావు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతర నిర్వహణకు బొలిశెట్టి విరాళం



పెంటపాడు, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పైళ్ళమ్మ జాతర పోస్టర్లను ఆదివారం క్యాంపు కార్యాలయం ఎమ్మెల్యే బొలిశెట్టి పోస్టర్లను ఆవిష్కరించారు. అనం తరం జాతర ఖర్చులకు గాను కమిటీ సభ్యులకు రూ 25 విరాళం అందజేశారు. పుల్లా బాబీ, చెరుకూరి జగత్ సోమశేఖర్, మజ్జి అప్పారావు, మట్టా రాంబాబు, వీర్ల సత్యనారాయణ, వీర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాసవి మాతకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే పూజలు



తాడేపల్లిగూడెం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం వాసవి కన్యకాపరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో అమ్మవారిని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్‌గోపాల్ దర్శించుకున్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళి, వాసవి క్లబ్ అధ్యక్షులు వసుమర్తి అనిల్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కొర్లేపర రాము, కోశాధికారి భోగవల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశ పరీక్షకు 94 మంది హాజరు

నరసాపురం రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మణేశ్వరం నక్కావారిపాలెంలో బీసీ గురుకుల పాఠశాలలో ఆదివారం ఇంటర్ ప్రవేశ పరీక్షకు 224 మంది హాజరు కావాల్సి ఉండగా కేవలం 94 మందే హాజరైనట్టు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. పరీక్షలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రం వద్ద పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థుల్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్ష కేంద్రం లోనికి అనుమతించారు.

పోలిశెట్టి స్మారక స్తూపానికి శంకుస్థాపన

వీరవాసరం/భీమవరంటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమర యోధుడు, సిపిఐ అగ్ర నేత యాళ్లబండి పోలిశెట్టి స్మారక స్థూపం పునర్నిర్మాణానికి వీరవాసరం మండలం నౌడూరు సెంటర్లో ఆదివారం శంకుస్థాపన చేశారు. గత మార్చిలో రోడ్డు విస్తరణలో పనుల్లో పోలిశెట్టి స్మారక స్తూపాన్ని తొలగించగా దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన అనంతరం స్తూపం పునః నిర్మాణానికి పంచాయితీ అనుమతించిన విషయం విదితమే. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వర్మ తదితరులు పాల్గొన్నారు.

తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి

అత్తిలి, మే 4 (ఆంధ్రజ్యోతి): స్కిన్నెరపురం పంచాయతీ పరిధిలో దాళ్వా సాగు వరి పంట చేతికి వచ్చే సమయంలో ఆదివారం గాలి వర్షం కారణంగా ఎక్కువ మంది రైతుల పంట తడిచి పోయిందని కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. అత్తిలి మండలంలో పలు గ్రామాల్లో రైతులను కలుసుకున్నారు. స్కిన్నెరపురం పంచాయతీ పరిధిలో గోనె సంచులు లేక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే సంచులు కొరత లేకుండా చూడాలని, తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఇంటా కొబ్బరి చెట్లు పెంచాలి : మంత్రి


మంత్రి రామానాయుడును సత్కరిస్తున్న కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు

పాలకొల్లు అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ 53వ వార్షికోత్సవం ఆదివారం సంఘ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికయిన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రతీ ఇంటిలోనూ కొబ్బరి చెట్టు పెంచాలన్నారు. ముందుగా నూతన కార్యవర్గం అధ్యక్షుడు కఠారి నాగేంద్రకుమార్, గౌరవాధ్యక్షుడు మాటూరి వీర వెంకట నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు చివటపు నాగేశ్వరరావు, కుందూరు వెంకట్రామయ్య, లంకలపల్లి సత్య రమేష్, కార్యదర్శి మాటూరి రామ కుమార్, కోశాధికారి దేవరపు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కొండేటి శ్రీనివాస్, అదనపు కోశాధికారి గుండుమోగుల నాగేశ్వరరావుతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రిని ఘనం గా సత్కరించారు మాజీ ఎమ్మెల్సీ అంగర, చాంబర్ అధ్యక్షుడు నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పోడూరు: మండలంలోని జిన్నూరు, వేడంగి గ్రామాల్లో రూ.1.95కోట్లుతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి రామానాయుడు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణలో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ దాటినప్పటికీ రైతు దగ్గర ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామనీ రైతులు అధైర్యపడొద్దని స్పష్టం చేశారు. పాలకొల్లు డీసీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, వైస్‌చైర్మెన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాదు, ఏఎంసీ చైర్మెన్ వైస్‌చైర్మెన్‌లు కోడి విజయభాస్కర్, దాసరి రత్నరాజు, నీటిసంఘం చైర్మెన్‌లు కుక్కల సత్యనారాయణ, గుబ్బల శ్రీరామ్, బీజేపీ కృష్ణాజిల్లా ఇనిచార్జ్ ఉన్నమట్ల కబర్ధి, నియోజకవర్గ ఇనిచార్జ్ యర్రంశెట్టి పద్మారావు, సర్పంచ్ చెల్లబోయిన శారద, ఇరిగేషన్ డిఈ వెంకటనారాయణ పాల్గొన్నారు.

దాసరికి ఘన నివాళి

పాలకొల్లు టౌన్: ప్రముఖ దర్శకుడు, కేంద్ర మాజీ మంత్రి దాసరి నారాయణ రావు పాలకొల్లు కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా నిలిపారని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. దాసరి జయంతి సందర్భంగా స్థానిక కెనాల్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దాసరి అభిమానులు, కళాకారులు వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకట రత్నం, వీరా పోతన, గుడాల హరిబాబు, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, జీవీ, కోడి విజయభాస్కరం, జక్కంపూడి కుమార్, జీఎస్ఎన్ రాజు, పి నాగ లింగేశ్వరరావు, ఎంఎన్‌వి సాంబశివ, శ్రీరంగ నాయుడు, చినమిల్లి గణపతి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ మల్టీకాన్ సమావేశం

పాలకొల్లు అర్బన్: సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌లు ముందుటాయని మంత్రి రామానాయుడు అన్నారు. పాలకొల్లులో జరుగుతున్న లయన్స్ మల్టీకాన్ రెండో రోజు సభలో మంత్రి ముఖ్య వక్తగా పాల్గొన్నారు. 3వ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వి విజయకుమార్‌రాజు, ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి. సుభాష్ బాబు, కన్వెన్షన్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సిహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ప్రవీణ్ భాను



పాలకొల్లు అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రేపాక నాగ వెంకటరత్న ప్రవీణ్ భాను ఎన్నికయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంఘ అధ్యక్ష స్థానానికి ఆదివారం ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా సీనియర్ నాయకుడు నాళం వెంకట సోమేశ్వర బాపిరాజు, సహాయ ఎన్నికల అధికారిగా కారుమూరి శ్రీరాములు వ్యవహరించారు. సంఘానికి మొత్తంగా 1496 ఓట్లు ఉండగా 1075 ఓట్లు పోలయ్యాయి. ఎన్నిక అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టగా ప్రవీణ్ భానుకు 739 ఓట్లు రాగా ప్రత్యర్థిగా పోటీ చేసిన తెలనాకుల కోటేశ్వరరావుకు 334ఓట్లు వచ్చాయి, దీంతో 405 ఓట్ల మెజార్టీతో ప్రవీణ్‌భాను విజయం సాధించినట్టు ఎన్ని కల అధికారి బాపిరాజు వెల్లడించారు. హోరా హోరిగా జరిగి ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికయిన ప్రవీణ్‌భాను ని పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అభి నందించారు. ప్రవీణ్ భాను మాట్లాడుతూ సంఘ పటిష్ఠతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.


'పాకా'కు గౌడ సంఘం సత్కారం


పాలకోడేరు, మే 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత, బీసీ నాయకుడు పాకా వెంకట సత్యనారాయణను ఆదివారం పాలకోడేరు గౌడ సంఘం నాయకులు ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. గౌడ సంఘ గౌరవాధ్యక్షుడు అంగర సుబ్బారావు, యిర్రింకి శ్రీనివాసు, అధ్యక్షుడు కారంకి సాయిబాబు, ఉపాధ్యక్షులు చిటికెన పుల్లయ్య, కార్యదర్శి బెజవాడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


యోగా పోటీల్లో విజేతకు సత్కారం

తాడేపల్లిగూడెం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆసియా యోగాసన పోటీల్లో బంగారు పతకం సాధించిన బాలం శిరిషను ఘనంగా సత్కరించారు. ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్యవతి నగర్‌లో శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం వద్ద ఆదివారం యోగా కోచ్ కరిబండి రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. శిక్షకులు నాగేశ్వరరావు, రాంబాబు, వెంకట్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దాబాల్లో మద్యం అనుమతిస్తే కఠిన చర్యలు

పెనుమంట్ర, మే 4 (ఆంధ్రజ్యోతి): మద్యం వినియోగంకు అనుమతిస్తున్న రెండు దాబా లపై కేసుల నమోదయ్యాయి. పెనుమంట్ర మండలంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరిపిన విస్తృత తనిఖీల్లో మండలంలోని మార్టేరు, వెలగలేరు గ్రామాల్లో దాబా రెస్టారెంట్లలో మద్యం వినియోగానికి అనుమతిస్తున్నారన్న సమాచారంపై తనిఖీలు నిర్వహించి కేసును నమోదు చేశారు. దాబాల్లో మద్యం వినియోగానికి అనుమతిస్తే కఠిన చర్యలు తప్పవని తణు కు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇనస్పెక్టర్ ఎస్. మణికంఠ రెడ్డి తెలిపారు. దాడులలో ఎస్సై లు ఆర్. మధుబాబు, లక్ష్మీ, హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాస్, కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సైకాలజిస్టు రామకృష్ణ

విలువలతో కూడిన విద్య అవసరం

తణుకు, మే 4(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించడానికి ప్రాధాన్యమివ్వాలని ప్రముఖ సైకాలజిస్టు యనమండ్ర జయవెంకట రామకృష్ణ చెప్పారు. ఆదివారం ప్రగతి విద్యాలయలో జరిగిన తల్లిదండ్రుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మార్కుల కోసం కాకుండా జ్ఞానానికి తల్లిదండ్రులు ప్రాధాన్యమివ్వా లన్నారు. సమాజంలో ఎలాంటి పరిస్థితులు అయినా ఎదుర్కొనే స్థైర్యాన్ని కల్పించాలని వివరించారు. ప్రగతి విద్యాలయ డైరెక్టర్ ప్రగతి రాజా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థి కూడా ఉన్నత చదువుల్లో వెనుకబడి పోతున్నాడని చెప్పారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన ఉదయం 10.30కు సమావేశం ప్రారంభ మవుతుందన్నారు. అజెండాను కౌన్సిల్ సభ్యులకు అందించామన్నారు.

జిల్లా మేదరి సంఘం ఎన్నిక

తణుకు, మే4(ఆంధ్రజ్యోతి): జిల్లా మేదరి సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. పట్టణంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ఎన్నికల అధికారి కొండా భాను శ్రీనివాసు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఆకివీడుకు చెందిన నందా కేశవరావు, ప్రధాన కార్యదర్శిగా తణుకుకు చెందిన దూళిపాళ్ల మునలయ్య, కోశాధికారిగా కొండా ఉదయ బాలాజీ, ప్రచార కార్యదర్శగా కాపెల్లి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులను సత్కరించారు. తణుకు సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం


బాబాకు అన్నాభిషేకం

భీమవరం టౌన్: భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ వెంకట సాయిబాబా మందిర వార్షికోత్సవాల్లో మూడో రోజు మందిరం వ్యవస్థాపక చైర్మన్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు బాబాకు విశేష పూజలు చేశారు. అనంతరం రాష్ట్ర పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అంజిబాబుతో అన్నాభిషేకం జరిపించారు.. అనంతరం అఖండ అన్న సమారాధనను తిరుమలరావు ప్రారంభించారు. ప్రభుత్వ విప్, జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, విజయవాడ రీజినల్ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, భీమవరం డీఎస్పీ ఆర్. జయసూర్య బాబాను దర్శించుకోగా వారిని తిరుమలరావు సత్కరించారు.

బండి ముత్యాలమ్మ జాతర ప్రారంభం

మొగల్తూరు, మే4(ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే బండి ముత్యాలమ్మ జాతరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. జూన్ 9న నిర్వహించే ఈజాతరకు సంబంధించి ఆదివారం ఆలయం పందిర రాట ఉత్సవాన్ని నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మాణిక్యాలరావు, ఈవో ఎం.అరుణ్ కుమార్, సర్పంచ్ సూరిబాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు భారీ అన్నసమారాధన

నరసాపురం టౌన్: పట్టణంలోని కొవెల గుడి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త పుప్పాల వెంకట కృష్ణారావు తెలిపారు. ఎంబర్‌మన్నార్‌స్వామి బ్రహ్మోత్సవాలు, తిరునక్షత్ర ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఈసమారాధన నిర్వహిస్తుమన్నారు. భక్తులు స్వామివారి ప్రసాదాలు స్వీకరించాలని కృష్ణారావు, ఈవో రామచంద్రకుమార్‌లు తెలిపారు.

గాలి, వాన బీభత్సం

●కూలిన విద్యుత్ స్తంభాలు.. ●రహదారులపై నిలిచిన నీరు ●జనజీవనం అస్తవ్యస్తం


బేతపూడిలో ఇంటిపై కూలిన కొబ్బరి చెట్టు

భీమవరం టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో విరుచుకు పడిన భారీ వర్షంతో పట్టణం అతలాకుతలమైంది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో చెట్లు కూలిపోవటంతోపాటు విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. చెట్లు కొమ్మలు విరిగిపడటంతో అనేక చోట్ల విద్యుత్ వైర్లు తెగిపడి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. నర్సయ్య అగ్రహారంలో బీసీ హాస్టల్‌లో ఉన్న భారీ చెట్టు పడిపోవటంతో వినోద్ కుమార్ అనే వ్యక్తి ఆటో ఛిద్రమైంది. తన జీవనాధారమైన ఆటో దెబ్బతినటంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చెట్టు కూలిపోయింది. ఇంటింటికి సరఫరాచేసే సరుకుల వాహనం దెబ్బతింది. జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనం రోడ్డులో చెట్టు పడిపోవటంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొరిగాయి. బలుసుమూడిలో చెట్టు పార్కుచేసిన కారుపై పడటంతో కారు ధ్వంసమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరఫరా పునరుద్ధరణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్షంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది.

భీమవరం రూరల్: భీమవరం మండలంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. తుందుర్రు, బేతపూడి, తాడేరు తదితర గ్రామాల్లో చెట్లు రహదారులకు అడ్డంగా పడిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు వేలాడాయి. విద్యుత్ స్తంభాలు నేలకొ రిగాయి. దీంతో చాలా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 24 గంటల వరకు కూడా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉండదనే అంచనాలో అధికారులు ఉన్నారు. మరమ్మతులకు విద్యుత్ శాఖ అధికారులు పరుగులు తీయాల్సి వచ్చింది.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో గంట పాటు కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా బ్రహ్మానందరెడ్డి మార్కెట్ అంతా బురదమయంగా మారింది. రూరల్ ప్రాంతంలో ధాన్యం తడిసి ముద్దయింది. భారీ వృక్షాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నరసాపురం రూరల్: తీరంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో ఎడతెరిపి లేకుండా మూడు గంటల పాటు వర్షం కురిసింది. రహదార్లు చెరువులు తలపించా యి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. జన జీవనం స్తంభించింది. మండలంలో చాల చోట్ల ఉరుములుతో పలు నివాసాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వైఎస్‌పాలెంలో రెండు చోట్ల పిడుగులు పడ్డాయి.

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. పల్లపు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. కూలిన చెట్లను విద్యుత్ అధికారులు సత్వరమే తొలగించడంతో రాకపోకలు యధావిధిగా జరిగాయి.

పోడూరు: భారీ వృక్షాలు, కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి. దీంతో నరసాపురం- మార్టేరు రహదారి పైనా, పాలకొల్లు- పెనుమదం, ఆచంటకు వెళ్లే రహదారుల పక్కన ఉన్న భారీవృక్షాలు రోడ్డుకు అడ్డంగా విరిగి పడటంతో వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ వైర్లపై కొబ్బరి చెట్లు విరిగిపడటంతో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఆకివీడు: భారీ వర్షానికి పట్టణం జలమయమయ్యింది. కొన్నిచోట్ల చెట్లు, టెంట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. రహదారులు చెరువులను తలపించాయి. ఇప్పటి వరకూ అధిక ఉష్ణోగ్రతలతో మండిపోయిన పట్టణం ఒక్కసా రిగా చల్లబడడంతో ప్రజలు సేదతీరారు.

పాలకోడేరు: పాలకోడేరు సెంటర్‌లో భారీ రావి వృక్షం నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

కాళ్ల: మండలంలో భారీ వర్షానికి ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం కాలువలను తలపించాయి. బలమైన ఈదురు గాలులు వీయడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


భీమవరంలో హోటల్ వద్ద కూలిన కప్పు

ఉండి: ఎన్‌ఆర్‌పి అగ్రహారం, ఉండిలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగిపడిపోయాయి. దాంతో సాయంత్రం వరకు విద్యుత్ లేక ప్రజలు ఇబ్బందులుపడ్డారు. ఉండిలో తడిసిన ధాన్యంతో రైతులు అవస్థలు పడుతున్నారు. పల్లపు ప్రాంతాల్లో డ్రెయిన్లలోని నీరు రహదార్లపైకి చేరి అధ్వానంగా మారాయి. ఈ వేసవిలోనైన పనులను చేసి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుమంట్ర: ఈదురు గాలులకు మండలంలో ఏడు విద్యుత్ స్తంభాల ధ్వంసమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బ్రాహ్మణచెరువు-పొలమూరు రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. ఉదయం పడిన చెట్లను సాయంత్రం వరకు తొలగించకపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆలమూరు ఎస్సీ కాలనీలో నీరు నిలిచింది.

అధికారికంగా భగీరథ జయంతి నిర్వహణ అభినందనీయం

తణుకు, మే 4(ఆంధ్రజ్యోతి): భగీరథ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించడం వెనుకబడిన కులాలను గుర్తించి అభివృద్ధిలోకి తీసుకురావాలన్న ప్రభుత్వ ఉద్దేశం అన్నారు.

సూర్యభగవానుడికి అభిషేకాలు

పాలకొల్లు అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడిగట్టున ఉన్న సూర్య దేవాలయంలో ఆదివారం భాను సప్తమి సందర్భంగా అర్చకులు కొత్తలంక సుబ్రహ్మణ్యం స్వామివారికి ఆవు పాలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మేడికొండ శ్రీనివాసరావు చౌదరి, న్యాయవాది డాక్టర్ దశిక శేషగిరిరావు, జయరాం, పెద్ద సంఖ్యలో మహిళలు స్వామిని దర్శించుకున్నారు.